# భోజనప్రియుడు

మంత్రవాది మహేశ్వర్

## 'వాతాపి గణపతిం భజే-'

పాట మృదు మధురంగా వినిపిస్తోంది.

అది వింటూ తనని తాను మరచిపోతున్నాడు విఘ్నేశ్వరస్వామి. తనూ మధ్య మధ్య గొంతు కలుపుతున్నాడు. తన్మయత్వంతో కళ్ళు మూతలు పడుతున్నాయి. తల అటు - యిటూ ఊగుతోంది. స్వామివారి ఆనందాన్ని గ్రహించిన మూషికం నాట్యం చేయడం మొదలెట్టింది.

పాట తక్కున ఒక్కసారిగా ఆగిపోయింది.

తన్మయత్వం చెదరిపోయింది - విఘ్నేశ్వరస్వామి కళ్ళు తెరిచి చూశాడు. మూషికం చెవులు నిక్కించి అటూ యిటూ చూస్తోంది.

ఎదురుగా కుమారస్వామి.

"బావుంది ... చాలా బావుంది. సంగీతాస్వాదనలో మునిగిపోయావన్న మాట"

"ఏమైందిప్పుడు ... నా ఆనందానికి భంగం కలిగించింది నువ్వేనా ..."

"అహఁ నేనే ... నీ లోకంలోంచి బయటికొచ్చి ఒక్కసారి భూలోకం పరికించమంటున్నాను. నీకు టైమ్ ప్రకారం అమ్మ అన్నీ అమర్చి పెడుతుంటే ఏం తెలీటం లేదు ..."

"ఏం ఎందుకంత కోపంగా వున్నావు"

"ఎల్లుండి ప్రత్యేకత"

"ఓహోఁ చవితి రోజనా ... అవును ప్రజలు నన్ను భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారు"

"నైవేద్యాలు సమర్పిస్తారు ... వాళ్ళెంత కష్టాల్లో వున్నా నిన్ను కొలుస్తూనే వుంటారు" వెటకారం ధ్వనించింది.

"అవును"

"సిగ్గులేదు. ఆ మాట అనడానికి. వారి కష్టాలేమిటి అని ఏనాడైనా ఆలోచించావా"

"నాకు చాలా కోపం తెప్పిస్తున్నావు. నాకసలే ఆకలిగా వుంది. భోజనం చేసేక తీరుబడిగా కూర్చుని చర్చించుకుందాం"

"ఆగు వెళ్ళడానికి వీల్లేదు. నీ ఆకలి ... నీ తిండీకాదు. వెళ్ళి భూలోకంలో ముఖ్యంగా తెలుగు ప్రజలు హోటళ్ళలో డబ్బులు పోస్తూ ఎలాంటి అవస్థలు పడుతున్నారో చూడు."

"అంటే అంతవరకూ నన్ను భోంచేయద్దంటావు"

"నీ భక్తుల మీద నీకు ప్రేమ వుంటే ఆకలితో వెళ్ళి కష్టాలు తెలుసుకో పొరపాటునైనా ఎవరింటికి వెళ్ళద్దు. తెలుగువారు చాలా ఉదార స్వభావులు. అందులోనూ పండుగపూట వచ్చే అతిథిని అమితంగా గౌరవిస్తారు. ఆ గౌరవం కాకుండా ఏదైనా హోటల్‌కెళ్ళి నీ భక్తుల అవస్థ చూడు"

"సరే ... రేపే బయలుదేరి వెడతాను"

* * * * *

వినాయకరావు అవతారం దాల్చాడువిఘ్నేశ్వర స్వామి.

ఒక మధ్యతరగతి మనిషిలా మారాడు.

ఎండ మాడ్చిపారేస్తోంది ఉదయమే.

జగదాంబ జంక్షన్ నుంచి ఓ నాలుగడుగులు వేశాడు వినాయకరావు.

కనిపించిన ఓ హోటల్‌లోకి నడిచాడు.

కుర్చీలో కూర్చున్న పావు గంట దాకా సర్వర్ రాలేదు.

ఓపిక చచ్చిపోతున్న సమయంలో అటు యిటూ చూశాడు.

-క్యాష్ కౌంటరు దగ్గర కూర్చున్న లావుపాటి శాల్తీ డబ్బులు పుచ్చుకొంటూనే అక్కడున్న దేవుళ్ళ పటాలకు హారతిపడుతున్నాడు ... గట్టిగా అంటే అనేదేమిటో తెల్సిపోతుందని పెదాలు మాత్రం ఆడిస్తున్నాడు.

- ఇంతలో చెవిలో పెన్సిలు ముక్క, చేతిలో చిన్న బిల్ బుక్‌తో వచ్చిన వ్యక్తి విసుగ్గా అడిగాడు.

"ఏం కావాలి" - ఇంకా ఏం కావాలి అన్నట్లుంది. తీరు.

"భోజనం"

"అప్పుడేనా" హేళనగా నవ్వాడు. ఆ నవ్వులో నీకింకేం పని తినడం తప్ప అన్న భావం తొణికిసలాడింది.

"తిదేమిటి పది దాటింది కదా" గోడ గడియారంకేసి చూసి మరీ అన్నాడు.

"పదకొండింటికి ... ఇంకా 'మీల్స్ రడీ' బోర్డు పెట్టలేదు కదా"

అక్కడే వెయిట్ చేయాలా - లేకపోతే మరేదైనా హోటలుందా అనుకుంటూ లేచాడు.

బయటకు నడిచి నాలుగడుగులు వేశాడు.

'డాల్ఫిన్స్' మరో హోటల్ కనిపించింది.

ఖరీదైన మనుషుల కోసం అన్నట్లుగా వుంది ... కడుపులో ఆకలి దంచేస్తోంది ... వెళ్ళిపోదాం డబ్బయితే అయింది అనుకున్నాడు గానీ -'మధ్యతరగతి స్థాయిని మించి వెళ్ళకూడదు అన్న కుమారస్వామి పెట్టిన కండిషన్స్ గుర్తొచ్చి ఆగిపోయాడు.

అటు - ఇటూ తిరిగి కాలక్షేపం చేసి దాహానికి తట్టుకోలేక అయిస్ సోడా అని వ్రాసి వున్న కిళ్ళీ కొట్టు దగ్గరికెళ్ళి వాడిచ్చిన మామూలు సోడా త్రాగి, చిల్లర యివ్వనందుకు కొట్టువాడితో తిట్లు తిని మళ్ళీ అదే హోటల్ వైపు నడిచాడు.

'మీల్స్ రడీ' - బోర్డ్ తగల్చబడి వుంది.

'మళ్ళీ వచ్చాడేమిటి' అన్నట్లు చూశాడు ప్రొప్రయిటర్. పది నిముషాల తరువాత సర్వర్ వచ్చి ఇందాక చూసిన మొహమే అన్నట్లు పోజిచ్చాడు.

"భోజనమేనా ...ఓ పావు గంట అవుతుంది"

"మరి 'మీల్స్ రడీ' బోర్డ్ తగిలించారు"

"కర్రీ అవలేదు ... చట్నీ అవలేదు తెచ్చేయమంటారా"

మరింకేం అయిందో అర్థంకాలేదు వినాయకరావుకి.

అక్కడికొచ్చిన అరడజను మంది అమ్మాయిల్ని "ఏం కావాలి" అని అడగడానికి నవ్వు ముఖంతో వెళ్ళిపోయాడు.

మరోపది నిముషాలు అలాగే కూర్చుని విసిగెత్తిపోయి క్యాష్ బాక్స్ దగ్గర కూర్చున్న ప్రొప్రయిటర్ దగ్గరికెళ్ళి "ఎక్స్‌క్యూజ్‌మి ... మీ పేరు! అనడిగాడు.

"వీరేశలింగం"

"ఈ పేరు ఎక్కడో విన్నట్లుగా వుందే ... ఓహో సంఘ సంస్కర్త ... మహానుభావుడు ... ఇతగాడు పెట్టుకున్నాడన్న మాట' అనుకుని "చూడండి లింగంగారూ ... భోజనం యింకా ఆలస్యమవుతుందా"

"లేచండి అయిపోయి వుంటుంది. ఈవేళ వినాయకచవితి కద సార్ ... స్పెషలు హడావిడి ..." అంటూ టేబుల్ మీద తుప్పు పట్టిన బెల్ నొక్కాడు.

బక్కపల్చగా వున్న ఓ సర్వర్ వగ్గుతూ వచ్చాడు. శ్రామిక వర్గానికి ప్రతినిధిలా వున్నాడు.

"ఈ సార్‌కి ఏం కావాలో చూడు"

"మీల్స్ ..." అరుచుకుంటూ వెళ్ళిపోయాడు.

వెళ్ళిన ఓ పది నిముషాలకి వేళ్ళు ముంచి తెచ్చిన రెండు గ్లాసుల్ని టేబుల్‌మీద బలంగా పెట్టాడు.




త్రాగుదామని గ్లాసు చూసుకొనేసరికి అందులో ఒక దోమ, రెండు చీమలు.

ఏమిటని అడిగితే కనిపించటం లేదా అనో, మీరిచ్చే డబ్బులకి ఏనుగులు, గుర్రాలు వస్తాయటండి అనో కళ్ళు జోకులేస్తాడేమోనని భయపడుతూనే - మీల్స్ ప్లేట్ టేబుల్ మీద పెడుతున్న సర్వర్‌తో "ఏమిటయ్యా చూడు ..." అన్నాడు.

"ఆ చీమలే సార్" వేలుతో తీసిపారేసాడు. అవి మీద పడ్డాయో ఏమో తింటున్న ప్రక్క టేబుల్ వ్యక్తి

తలెత్తి చూశాడు కోపంగా.

"అదేమిటయ్యా ... శుభ్రమైనవి పట్రా ..." అన్నాడు.

అలా అన్నందుకు కోపంగా వెళ్ళిపోయాడు.

బియ్యంలో రాళ్లో ... రాళ్లల్లో బియ్యమో ... ముద్ద ముద్దకి అరడజను.

బంగాళదుంప కూర అతి భయంకరంగా వుంది.

ఉప్పు వేయడం మరచిపోయిన పప్పు ...

కళ్లలోంచి నీళ్ళు తెప్పించే చట్నీ ...

పులుపెక్కువైపోయిన సాంబారు ...

"కాలే కడుపుకు మండే బూడిద" అన్నట్లు చాలామంది పట్టించుకోకుండా తినేస్తున్నారు త్వరత్వరగా.

తనకి మాత్రం ఆకలేస్తున్నా కడుపులోకి వెళ్లటంలేదు.

గిన్నెలు కడిగిపోసిన నీళ్ళులాంటి మజ్జిగ వేళ్ళు ముంచి టేబుల్ మీద పెట్టాడు. వేళ్ళు ముంచి తేవడమే తమ జీవిత ధ్యేయంగా పెట్టుకున్నట్టున్నారు సర్వర్లు.

నూనె ఓడుతున్న అప్పడం ...

మూడు నాలుగేళ్ల క్రిందటి ఊరగాయ ...

"అయ్యగారికి స్పెషల్ యిచ్చావా" అడిగాడు ప్రొప్రయిటర్ సర్వర్ని.

"ఇప్పుడే తీసుకొస్తాను. మర్చిపోయాను" అంటూ లోపలికెళ్లాడు.

"స్పెషలేమిటి" భయపడ్డాడు వినాయకరావు.

"ఇవేళ వినాయకచవితి కద సార్ ... 'స్పెషల్' అని ఓ ప్లేటు ముందు పెట్టాడు"

ప్లేటులో రెండు ... 'ఉండ్రాళ్ళు' ... గుండ్రంగానే వున్నాయి.

చూడగానే నోరూరింది. హోటల్ భోజనం ఉండ్రాళ్ళు తినే అదృష్టం వుంటుందో లేదో అనుకున్నాడు.

తిందామని ముట్టుకోగానే అదో రకమైన ఫీలింగ్.

కార్క్ బాల్సులాగున్నాయి.

తినడం తనవల్ల కాదనిపించింది.

# నరజాతులు నవ్వుతాయి

**–డా. సి. నారాయణరెడ్డి**

గది కదలదు.
గదిలో రెక్కలు కొట్టుకునే
ఉదయాలు కదులుతాయి.

తోట నడవదు.
తోటలో రేకులు తొడుక్కునే
పరిమళాలు నడుస్తాయి.

ఇసుక ఎగరదు.
ఇసుకతో చేతులు కలిపే
సుడిగాడ్పులు ఎగురుతాయి

కొండ కురవదు.
కొండతో తలబాదుకునే
కారుమబ్బులు కురుస్తాయి.

కోతి నవ్వదు.
కోతితో మూతులు కలుపుకునే
నరజాతులు నవ్వుతాయి.

## భోజనప్రియుడు

ఎదురుగా వున్న సీట్లో కూర్చున్నతను ఉండ్రాళ్లని కరకరా నమిలిపారేస్తున్నాడు. చూస్తుండగానే గ్లాసుడు మంచినీళ్ళూ త్రాగి బ్రేవ్‌మని త్రేన్చి లేచాడు.

కంచంలో ఒక్క మెతుకు మిగల్చలేదు అతను -

తన కంచం చూసుకున్నాడు ... ఇంచుమించు వేసినవన్నీ వేసినట్టే వున్నాయి. అన్నీ రుచి చూసి పెడుతున్నట్లుంది.

చిన్న స్టీల్ ప్లేటులో 'బిల్' పెట్టి తీసుకొచ్చి నిలబడ్డాడు.

తీసి చూస్తే ఆర్రూపాయలు అని వుంది. ఉండ్రాళ్లకి ఎక్స్ట్రా రూపాయి ... మొత్తం ఏడు.

నవ్వుతూ నిలబడ్డాడు సర్వర్.

ముందు అర్థంకాలేదు. తరువాత తెలిసింది 'టిప్' కోసం వెధవ వేషం వేస్తున్నాడని.

మొత్తానికి భోజనం ఖర్చు ఒక్క పూటకి ఏడున్నర.

పైగా ఆకలి ఏమి తీరలేదు ... నోరు పాడు చేసుకోవడానికి వచ్చినట్లుంది. అయినా జనం బాగానే వున్నారు. మంచి హోటలు అన్న ముద్ర పడిందట.

బయటికొచ్చి హోటల్ బోర్డు చూశాడు.

'శ్రీ గణేష్ విలాస్, ప్యూర్ వెజిటేరియన్ మీల్స్ అండ్ కాఫీ - ప్రొప్రయిటర్ : వీరేశలింగం'.

'ఓరి దొంగ పీనుగా నా పేరే దొరికిందిరా నీకు - ఈ విధంగా జనం దగ్గర డబ్బు దోచేస్తూ సంఘ సంస్కర్త పేరు నువ్వెట్టుకొని పైగా నా పేరు నీ హోటల్‌కి పెడతావా ... దుర్మార్గుడా ... నీలాంటివాళ్ల వల్లే జనానికి భగవంతుడి పైన నమ్మకం సన్నగిల్లుతోంది ...' అనుకుంటూ బయటికి నడిచాడు ...

నడుస్తూనే వున్నాడు వినాయకరావు.

రోడ్డు మీదపందిళ్ళు..విఘ్నేశ్వరుడి విగ్రహాలు...

చందాల కోసం కుర్రాళ్ళు డబ్బాలు గల గలాడిస్తూ అటూ ఇటూ పోయే జనాన్ని పీక పొకం పట్టేస్తున్నారు.

వాళ్లకి డబ్బులు వేయకుండా వెళ్లడం ఎవరి తరం కాదనిపించింది, వినాయకరావుకి.

ఓ అర్ధ రూపాయి వేసి ముందుకు వెళ్లాడు.

ఇప్పుడు వినాయకరావుకి చాలా కోపంగా వుంది.

తన పేరున్న హోటల్లో అంత దరిద్రమైన భోజనం చేసినందుకు కాదు, అలా డబ్బులిచ్చి అటువంటి వాళ్లను పోషిస్తున్నందుకూ కాదు ... మరి–

-వినాయకచవితి సందర్భంగా ఏర్పాటైన పందిళ్ల దగ్గర అమర్చిన స్పీకర్లోంచి అసభ్యమైన పాటలు కర్ణభేరిని బ్రద్దలు చేస్తున్నందుకు. □

